ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి, 2024
5
శ్రీకాకుళం

యుపిఎస్‌సిలో మెరిసిన పవన్

ప్రజాశక్తి- సోంపేట
ఇటీవల విడుదలైన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో మండలంలోని పలాసపురానికి చెందిన ఎన్.పవన్ 65వ ర్యాంకు సాధించాడు. స్థానిక పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న పవన్ సోంపేటలోని ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఆంధ్రా యూనివర్సిటీలో జియాలజికల్ విభాగంలో ఎంఎస్‌సి పూర్తి చేశాడు. ప్రస్తుతం బెంగళూరులో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ చేస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన యుపిఎస్‌సి పరీక్షలో జియాలజికల్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 65వ ర్యాంకు పొంది మైన్స్ విభాగంలో ఉద్యోగం సాధించాడు. అతని విజయంపై తల్లిదండ్రులు బయలరావు, శ్రీదేవి, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

సొంతూళ్లకు..

పలాస : రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వలసదారులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
పచ్చని పొలాలు... కల్లాల్లో పండిన పంటలు... తల్లిదండ్రులు... అన్నదమ్ములు... అక్కచెల్లెళ్ల ఆప్యాయతా అనురాగాలు.... ఉన్నంతలో కలసిమెలిసి సాగే జీవనం... ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలోగిలికి కుటుంబమే ఆధారం. ఇదీ మన పల్లె ఖ్యాతి. కానీ, పల్లెల్లో ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో తాళం వేసిన ఇళ్లు.. చెట్ల కింద వృద్ధులు నిరీక్షణ... ఏవైనా పండగలు వస్తే తప్ప పల్లెల్లో కళ లేకుండా పోయింది. సొంతూరిని, కన్నవారిని కలుసుకునేలా 'సంక్రాంతి' పండగ తెచ్చింది. పిల్లలంతా బతుకుతెరువు పట్టణాలు పోతే ఇంటివద్ద నిరీక్షిస్తున్న ముసలి ప్రాణాలకు మళ్లీ వీరి రాకతో గ్రామాల్లో ప్రేమబంధాలు వెల్లివిరుస్తున్నాయి. గ్రామాల్లో చేసేందుకు పనిలేక పొట్టకూటి కోసం ఊరు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికులు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. వలసలు పోవడంతో జనసంచారమే లేక నిన్నటివరకు ఇళ్లకు తాళాలు వేసి బోసిపోయిన గ్రామాలు ప్రస్తుతం జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. వలసలతో ఆత్మీయబంధాలతో పాటు బాల్యం కనుమరుగైపోగా అక్కున చేర్చుకునే అలనా, పాలనా కరవై అష్టకష్టాలు పడుతున్న చిన్నారులకు మరో 10 రోజుల పాటు తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొందనున్నారు. సంక్రాంతి పెద్ద పండగ కావడంతో ఉపాధి, ఉద్యోగాలు, వివిధ పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. గత రెండు రోజులుగా శ్రీకాకుళం, పలాసా, టెక్కలిలో ఉన్న రైల్వే, బస్‌స్టేషన్‌లో రైలు, బస్సుల నుంచి దిగిన కూలీలే ఎక్కువగా కనిపించారు.

పలాస : సంక్రాంతి పండుగ కోసం వలసజీవులు స్వస్థలాలకు చేరుతున్నారు. ఉద్దానం ప్రాంతం, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం, మెళియాపుట్టి తదితర మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారంతా రైళ్లు, బస్సుల్లో వస్తున్నారు. భువనేశ్వర్, విశాఖ, విజయవాడ, దుర్గ్ వంటి ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడ వస్తుండడంతో పలాస రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. పలాస రైల్వేస్టేషన్‌లో సాధారణంగా రోజూ ఐదువేల మంది తమ గమ్యస్థానాలు చేరుతుంటారు. సంక్రాంతి కావడంతో ఆ సంఖ్య రెట్టింపయ్యింది. రైల్వేశాఖ ప్రయాణికుల కోసం సికింద్రాబాద్, కోల్‌కత్తా, చెన్నయ్, బెంగళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు వేయడంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రైళ్లు దిగిన వారి బంధువులు స్టేషను రావడంతో తెల్లవారి నుంచే సందడి నెలకొంది. కొందరు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకోగా, మరికొందరు ఆటోల్లో స్వస్థలాలకు వెళ్తున్నారు.

ఆనందంగా ఉంది

మా గ్రామంలో ఉపాధి కరవైంది. దీంతో హైదరాబాద్, చెన్నయ్, ఒడిశా వంటి ప్రాంతాలకు వలసపోవాల్సివస్తోంది. పొట్టకూటి కష్టాలతో పొరుగు ప్రాంతాలకు వెళ్లి వస్తుండి కూడబెట్టిన సొమ్ముతో పండుగకు ఇంటి కొచ్చాం. కుటుంబ పెద్దలు, పిల్లాపాపలతో ఊసులాడు తుంటే ఎంతో ఆనందంగా ఉంది. రోజుకు రూ.500 కూలీకి యువతీ, యువకులు నిర్మాణ కార్మికులు, మట్టి పనులకు వెళ్తాం. పొరుగు ఊళ్లలో పడేకష్టం పడాల్సిందే. ఉండటానికి ఇళ్లు... కడుపునిండా తిండి ఉంటే ఇంటికి తెచ్చేందుకు ఇంక ఏమీమిగలదు.

-ఎస్.వాసులు, వలస కూలీ, యలమంచిలి, కోటబొమ్మాళి

పిల్లల చదువు కోసమే వలస

కన్నవారిని, సొంతూరిని వదిలి వెళ్లాలంటే బాధగా ఉంటుంది. నా వాళ్ల, మా బంధువులు, ఇళ్లు ఇక్కడే వున్నా బతుకుతెరువు కోసం, పిల్లల చదువు, వారి బంగారు భవిష్యత్ కోసం కష్టాన్ని దిగమింగి వలసలు వెలుతున్నాం. మేం అక్కడ ఉన్నా పిల్లలు, వారి భవిష్యత్‌పైనే దృష్టి పెడతాం. వారికి ఏం చేస్తే మాలా వలసలు వెళ్లకుండా మంచి జీవితాలు గడుపుతారోనని అలోచిస్తాం. చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు పొందేందుకే మేం కష్టపడుతున్నాం.

- సనపల ఆనందరావు, ఊడికలపాడు, కోటబొమ్మాళి

అంబేద్కర్ స్మృతివనం అపూర్వం

● 19న ప్రారంభించనున్న సిఎం జగన్ ● వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 18.81 ఎకరాల స్థలంలో రూ.400 కోట్లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేద్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహ నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, పాదపీఠం ఎత్తు 85 అడుగులు అని, దీంతో మొత్తం విగ్రహం ఎత్తు 210 అడుగులు ఉంటుందన్నారు. ప్రపంచంలో ఇదే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం అన్నారు. స్మృతివనంలోని అంబేద్కర్ ఎక్స్పీరియన్స్ సెంటర్, కన్వెన్షన్ సెంటర్, మినీ థియేటర్, ఫుడ్ కోర్టు, చిన్నారులకు ప్లే ఏరియా, గార్డెన్లు, మ్యూజిక్ ఫౌంటెయిన్, వాటర్ ఫౌంటెయిన్లు కూడా సిఎం ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొన్నాడ రుషి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు భోగి

ప్రజాశక్తి- రణస్థలం
భోగి పండుగ నాడు సంబరమంతా పిల్లలదే. కొత్త బట్టలు ధరించి భోగి మంటల్లో భోగి పిడకలు వేయడంతో భోగి సంబరాలు మొదలవుతాయి. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోస్తారు. తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు మొదలయాయ్యి. ఇంటింటా సందడి మొదలైంది. పిండి వంటలు గుమగుమలాడుతున్నాయి. కోడి పందాలు డూడూ బసవన్న, ఆటాపాటా సందడి.. ఇంటి ముంగిట రంగు రంగుల హరివిల్లులు, గోబెమ్మలు, భోగి పళ్ళ భోగి మంట హరిదాసు కీర్తనలు కొత్త అల్లుళ్లు.. కొత్త సినిమాల సందడిని తీసుకొచ్చింది. ఈ సంబరాల పండగ తెలుగు వారి పెద్ద పండుగ. మూడు రోజులు జరుపుకునే ఈ పండుగలో మొదటి రోజున వచ్చేది 'భోగి' పండుగ. భోగి అంటే తొలి రోజు అని అర్థం. ఈ రోజున ఇంటి ముందు భోగి మంటలను వేస్తారు. ఇక ఈ భోగి పండుగ నాడు సంబరమంతా పిల్లలదే.

కొత్త బట్టలు ధరించి భోగి మంటల్లో భోగి పిడకలు వేయడంతో భోగి సంబరాలు మొదలవుతాయి. సాయంత్రం భోగి పండ్లు పిల్లలకు భోగి పండ్లు పోస్తారు. భోగిపళ్లలో చేమంతి, బంతి పువ్వుల రేకులు, చిల్లర నాణేలు కలిపి పిల్లల.. పిల్లలకు దిష్టి తీసి వాటిని తలపై పోస్తారు.

సంక్రాంతి శోభ

కిటకిటలాడుతున్న జిటి రోడ్డు

బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగువారి పెద్ద పండుగ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ కోసం కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున మామార్కెట్ వెళ్లడంతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అటు వస్త్ర వ్యాపారులు, ఇటు ఫుట్‌పాత్ వద్ద కొనుగోలుతో జన సందడి కొద్ది రోజులుగా ఉంది. శనివారం చెరకు, రేగుపళ్లు, కంద, కలగాయకూరలు, పళ్లు, పూలు, మిఠాయిల తో పాటు పిండి వంటకాలనూ కొనుగోలు చేసుకున్నవారి సంఖ్య పెరిగింది. పూర్వం ఇంటిలోనే పిండివంటకాలు చేసుకొనే పరిస్థితి ఉంది. మారిన జీవనశైలితో పాటు మిఠాయిలు, పిండి వంటకాలూ బయట దుకాణాల్లో ఎప్పటికప్పుడు చేసి అమ్మకానికి ఉంచారు. నగరంలోని రైతు బజారు, ఇటు పొట్టి శ్రీరాములు మార్కెట్ కిటకిటలాడాయి.

టెక్కలి రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రమైన టెక్కలిలో శనివారం సందడి వాతావరణం చోటుచేసుకుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు టెక్కలి చేరుకోవడంతో టెక్కలిలోని ప్రధాన మార్గాలు రద్దీగా మారాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్, ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడళ్ల వద్ద జనసమ్మర్థం అధికమైంది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా వివిధ రకాల సామగ్రి డిమాండ్ ఏర్పడింది. కూరగాయాల దగ్గర నుంచి వస్త్రదుకాణాలు వరకు కొనుగోలుదారులతో రద్దీ పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు ట్రాఫిక్ రద్దీను నియంత్రించలేకపోయారు. దీంతో ద్విచక్ర వాహనాలు, బస్సులు రాకపోకల మధ్య ప్రజలు రాకపోకలకు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'అగ్రిగోల్డ్' బాధితులకు అండ

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు హామీ నిచ్చారు. కోటబొమ్మాళి టిడిపి కార్యాలయంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు ఎం.జయసింహ ఆధ్వర్యాన అగ్రిగోల్డ్ ఏజెంట్లు, సంఘ నాయకులు శనివారం అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని 11 లక్షల అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన వెంటనే స్పందించి అగ్రిగోల్డ్ బాదితులకు నష్టం జరిగిందని మాకు తెలుసునని, సైకో ముఖ్యమంత్రి జగన్ అగ్రిగోల్ బాధితులకు ఎన్నికలు ముందు పాదయాత్రలో ఆదుకుంటానని మాట ఇచ్చి వారి సమస్య పట్టించుకోలేదని అన్నారు. అయితే 2024లో టిడిపి అధికారం లోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను టిడిపి మేనిఫెస్టోలో పెట్టి అందరికీ న్యాయం చేస్తామని హామీఇచ్చారు. అప్పటి వరకు ఎవ్వరు అధైర్యపడవద్దయని, ఎలాంటి ఆత్మహత్యలు చేసుకోవద్దని అగ్రిగోల్డ్ ఏజెంట్లుకు, బాధితులకు కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ మహిళా కార్యదర్శి అరెలమ్మ, జిల్లా కార్యదర్శి కె.శ్రీను, సభ్యులు గుడ్ల రవికుమార్, నారాయణరావు, అప్పలస్వామి, బి.మోహనరావు, ఇ.భాస్కరరావు, కె.రాజారావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న బాధితుల సంఘం నాయకులు

ఓటమి భయంతోనే దుష్ప్రచారం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
సిఎం జగన్ రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబుపై ఉద్దేశ పూర్వకంగా దుష్ప్రచారం చేయిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఆయన తీరును, పెత్తందరీ పోకడలను వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో సిఐడి జగన్ జేబు సంస్థగా మారిందని విమర్శించారు. చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలను ప్రజలు గమినిస్తున్నారని అన్నారు. జగన్‌పై 38 కేసులు నమోదై ఉన్నాయని, రూ.43 వేల కోట్ల దోపిడీపై సిబిఐ, ఇడి ఛార్జిషీట్లు వేసిందన్నారు. ఈ కేసుల్లో 3,500 వాయిదాలు తీసుకుని బెయిల్‌పై తిరుగుతున్నారని అన్నారు. ఆయన చేసిన ఆర్థిక నేరాలను చూసి జడ్జిలు సైతం విస్తుపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఆయనకు శిక్ష తప్పదన్నారు.

టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ తమిళనాడు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస
తక్కువ స్థలంలో శారీరకంగా, మానసికంగా దృఢత్వం అందించి అన్ని వయసుల వారు ఆడే ఆట టెన్నికాయిట్ అని, ఇలాంటి జాతీయ ఆటల పోటీలు పలాసలో నిర్వహించం ఆనందంగా ఉందని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న 47వ జాతీయ పురుష, మహిళల టెన్నికాయిట్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ తమిళనాడు జట్టు విజయం సాదించింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంత్రి బహుమతులు అందిచి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నిర్వాహకులకు అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పలాసలో రూ.ఐదు కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నుంచి సముఖత లభించిందన్నారు. పెంటిభద్ర చెరువు ఆధునికీకరించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. చిన్నబాణాం మైదానంలో ఓపెన్ ఆడి టోరియం నిర్మించడానికి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు.

విజేతలు వీరే...

టీం ఛాంపియన్ షిప్‌లో పురుషుల విభాగంలో కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి జట్లు నిలిచాయి. టీం ఛాంపియన్ షిప్‌లో మహిళల విభాగంలో తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, మహారాష్ట్ర జట్లు నిలిచాయి. సింగిల్స్ పురుషుల విభాగంలో ఎం.వైరముత్తు (తమిళనాడు) కిరణకుమారి (కర్నాటక) సి.రాజశేఖరన్ (కేరళ), పి.మురుగేషన్ (కర్నాటక)లు విజేతలుగా నిలిచారు. సింగిల్స్ మహిళల విభాగంలో ఆశ్వర్యబాబు (కేరళ), కమలిక్ (పాండిచ్చేరి), ఎ.రమ్య (తమిళనాడు), ముత్తుఅజంగి (పాండిచ్చేరి)లు విజేతలుగా నిలిచారు. డబుల్స్ పురుషులు విభాగంలో ఎస్.అభిషేక్. డి.విల్సన్ (తమిళనాడు). పి.సంతోష్‌కుమార్, ఎం.జి.లక్ష్మణ్ (కేరళ), పిజెఎండి రాయవు. వినయ్కుమార్ (ఆంధ్రప్రదేశ్), సునీల్ యశ్వంత్ కేధార్, పటమహేష్ సంతోష్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. డబుల్స్ మహిళల విభాగంలో డి.దీక్షిత, ఎస్.పునీత్రపియ (తమిళనాడు), రెడ్డి మౌనిక, పతివాడ రేణుక (ఆంధ్రప్రదేశ్), భార్గవి సంజయ్ పవర్, రేణుక సమీరవయాహార్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్ విభాగంలో బి.జయమిరిశాకన్నన్, ఎస్.మేనక (తమిళనాడు), చిత్రాడ తారకేశ్వరరావు, మల్లు ప్రవళిక (ఆంధ్రప్రదేశ్), రంజిత్, ఎం.అంచిత (కేరళ) సురజ్ధుధాకుమార్, జోష ఫిసజిదలి సయ్యద్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్ విభాగంలో బి.జయమిరిశాకన్నన్, ఎస్.మేనక (తమిళనాడు), చిత్రాడ తారకేశ్వరరావు, మల్లు ప్రవళిక (ఆంధ్రప్రదేశ్), రంజిత్, ఎం.అంచిత (కేరళ), సురజ్న్ధాకుమార్, జోషఫిసజిదలిసయ్యద్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. 24 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్ షిప్గా తమిళనాడు నిలవగా, 19 పాయింట్లో కేరళ, 8 పాయింట్లతో పాండిచ్చేరి నిలిచింది. ఈ పోటీల్లో సురోజిత్ కర్మాకర్, టెన్నికల్ కమిటీ చైర్మన్, డి.శంకర్, టెక్నికల్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టెన్నికాయిట్ అసోషియేషన్ అధ్యక్షులు వై.డి.రామారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎన్.వి.సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి పి.తవిటయ్య, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి.రమణ, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లాకు చెందిన పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, వైస్ చైర్మన్ మీసాల సురె ష్బాబు, స్పోక్పుర్సన్ గుజు జోగారావు పాల్గొన్నారు.

33వ రోజుకు అంగన్వాడీల సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న గోవిందరావు

ఆమదాలవలస : దీక్ష వద్ద భోగి వేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం
అంగన్వాడీల పోరాటానికి సిపిఎం పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని కలెక్టరేట్ వద్ద జ్యోతిభాపూలే పార్కు వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద శనివారం పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె సమంజసమైనదని, నాలుగేళ్లుగా అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టారని తెలిపారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఎలా బతకాలని ప్రభుత్వానికి ప్రశ్నించారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ ఇవ్వడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ పండగ తర్వాత అంగన్వాడీల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్మా జిఒ కాపీలను ఆదివారం భోగి మంటల్లో దహనం చేస్తామని అన్నారు. ఆమరణ నిరాహారదీక్షలు చేపడుతామని తెలిపారు. ప్రజల్లో వెళ్లి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వివరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా కోటి సంతకాలు సేకరణ చేపడతామని తెలిపారు. అంగన్వాడీలు 33 రోజులుగా సమ్మె పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి అంగన్వాడీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ చట్టాన్ని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని అన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య నిమ్మరసం ఇచ్చి 24 గంటల నిరాహారదీక్షలు విరమింపజేశారు. ఈ శిబిరంలో సిఐటియు నాయుకులు ఆర్.ప్రకాష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయుకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న, దుంపల సుధర్శన పాల్గొన్నారు.

కొత్తూరులో చేపట్టిన సమ్మెలో ప్రజా సంఘాలు నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు జలజాక్షి, ధనలక్ష్మి, అమ్మాయమ్మ. బోడమ్మ. అరుణ, మధురవేణి, రజని, లక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీలు, ఆయాలు, సిఐటియు నాయకులు నంభూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు పంచాది లతా దేవి, పి.భూలక్ష్మి, మాధవి, పి.లక్ష్మి, కనకం, సునీత పాల్గొన్నారు. సమ్మె శిబిరం వద్ద భోగి మంటను వేసి పండగ చేసుకుని నిరసన తెలిపారు.

ఇచ్ఛాపురంలో మోకాళ్లపై కూర్చొని తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో హైమా, బాలామణి, కోమలి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : జిఒ కాపీలను చూపిస్తున్న అంగన్వాడీలు

ఇచ్ఛాపురం : మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొత్తూరు : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

రాజకీయ బదిలీలు గట్టెక్కిస్తాయా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి
వైసిపిలో రాజకీయ పరిణామాలు 'ఏ నిమిషానికి ఏమి జరగునో ఎవరు ఊహించదెవరని' ఓ సినీ రచయిత అన్నట్లుగా ఉంది. జిల్లాలో ఏ నేతకు ఎప్పుడు సమన్వయకర్త పదవి వరిస్తుందో ఎవరి అంచనాలకు దొరకడం లేదు. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసును అధిష్టానం గతేడాది టెక్కలి బాధ్యతల నుంచి తప్పించి ఆయన సతీమణి దువ్వాడ వాణిని సమన్వయకర్తగా నియమించింది. ప్రత్యక్ష ఎన్నికల్లో ఇక అయన అధ్యాయనం ముగిసినట్లే అంతా భావించిన సమయంలో మళ్లీ టెక్కలి అభ్యర్థిగా పోటీ చేయించాలని నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సమన్వయకర్తగా దువ్వాడ వాణిని నియమించినా పార్టీ కేడర్‌ను కలుపుకునిపోవడంలో కొంత వైఫల్యం చెందినట్లు అధిష్టానం గుర్తించింది. నియోజకవర్గంలో నెలకొన్న గ్రూపుల పోరుతో కొంత మంది నాయకులూ ఆమెకు సహకరించలేదు. దీంతో సర్వేలో ఆమెకు వ్యతిరేకంగా ఫీడ్ బ్యాక్ రావడంతో అనివార్యంగా ఆమెను మార్చారని తెలుస్తోంది. కొత్తగా నియమితులైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మునుపటి ఉత్సాహం చూపుతారా? అనేది సందేహంగానే ఉంది. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పార్టీలో మూడు ముక్కలాట సాగుతోంది. స్థానిక ఎన్నికల నుంచి సాగుతున్న గ్రూపుల పోరు ఇప్పటికీ అలానే ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేడర్ దువ్వాడ, తిలక్ వర్గాలుగా విడిపోయాయి. మరోపక్క కేంద్ర మాజీ మంత్రి కృపారాణి వర్గంగా కొంత మంది నాయకులు చలామణి అవుతున్నారు. గ్రూపుల పోరును ఎంత వరకు నెట్టుకువస్తారనేది వేచి చూడాల్సి ఉంది. అదీగాక కొద్ది నెలలు పాటు బాధ్యతలు చేపట్టిన దువ్వాడ వాణి వెంట కొంత కేడర్ ఉంది. ఆమెను సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పించడంతో ఆగ్రహంతో ఉన్న ఆ వర్గం దువ్వాడ శ్రీనివాస్‌కు ఎంత వరకు సహకరిస్తారనేది చూడాల్సి ఉంది.

మరోవైపు అధిష్టానం మాత్రం శ్రీనివాస్‌ను అచ్చెన్నకు బలమైన అభ్యర్థిగా భావిస్తోంది. 2019 ఎన్నికల్లో ఎంపీ రామ్మోహన్ నాయుడుపై పోటీ చేసిన దువ్వాడ గట్టి పోటీనే ఇచ్చారు. సామాజిక సమీకరణాలు, వెన్నుపోట్ల రాజకీయాలతో కొద్ది తేడాతో ఓటమిపాలయ్యారని అధిష్టానం భావించింది. ఇప్పుడు దువ్వాడకు పట్టున్న టెక్కలి నియోజకవర్గం నుంచి బరిలో దించితే గెలిచే అవకాశలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నట్లు తెలిసింది.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనూ అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఎవరూ ఊహించని విధంగా జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయను పార్టీ సమన్వయకర్తగా నియమించింది. అక్కడ మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మికి ఇస్తారని ప్రచారం జరిగింది. దీనిపై నియోజకవర్గంలోని స్థానిక ప్రజాప్రతినిధుల అంతా రాజ్యలక్ష్మి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ... అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై పునరాలోచనలో పడిన అధిష్టానం చివరకు పిరియా విజయను సమన్వయకర్తగా నియమించినట్లు తెలిసింది. పిరియా సాయిరాజ్‌ను తప్పించడానికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్యనేతలు ప్రయత్నించినట్లు నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. మహిళ అభ్యర్థిని నియమిస్తే పార్టీకి విజయావకాశాలు పెరుగుతాయని భావించిన అధిష్టానం పిరియా విజయ వైపు మొగ్గుచూపినట్లు సమాచారం. దీంతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స అధిష్టానాన్ని ఒప్పించడంతో సాయిరాజ్ కుటుంబానికి సమన్వయకర్త బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో నెలకొన్న గ్రూపుల నేపథ్యంలో ఎలా గట్టెక్కుతారో వేచి చూడాల్సి ఉంది.

ఎంపీ అభ్యర్థి విషయంలోనూ వైసిపి అధిష్టానం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ధర్మాన సోదరులతో పాటు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంలో ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ప్రధానంగా ధర్మాన సోదరుల్లో ఎవరినో ఒకరిని బరిలో దింపనుందనే చర్చ విస్తృతంగా సాగింది. టిడిపి అభ్యర్థిగా మళ్లీ పోటీ చేయనున్న ఎంపీ రామ్మోహన్ నాయుడుపై వెలమ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థినే పోటీలో నిలపాలని అధిష్టానం ఒకానొక దశలో ఆలోచించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఊహాగానాలకు తెరదించుతూ కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ నియమించింది. జిల్లాలో ప్రస్తుతం ఇదే పెద్ద చర్చ నడుస్తోంది. ఎంపీ రామ్మోహన్ నాయుడుకు ఎంత వరకు పోటీ ఇవ్వగలరనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతోంది. గత ఎన్నికల్లో కాళింగ సామాజిక తరగతికి చెందిన దువ్వాడ శ్రీనివాసునే వైసిపి పోటీకి నిలిపింది. ఇప్పుడు అదే సామాజిక తరగతికి చెందిన పేరాడ తిలక్‌ను బరిలో నిలపాలని నిర్ణయించడం పార్టీకి ఎంత వరకు దోహదపడుతుందో వేచిచూడాలి. ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌కు ధర్మాన సోదరులతో పాటు అందరితోనూ సత్సంబంధాలు ఉండటంతో అంతా సమిష్టిగా తిలక్ విజయానికి పనిచేస్తారని అధిష్టానం భావించినట్లుగా తెలిసింది. టెక్కలిలో గట్టెక్కాలంటే పేరాడ్ తిలక్ గెలుపు కోసం దువ్వాడ, ఎంపీగా గెలుపొందాలంటే దువ్వాడ విజయం కోసం పేరాడ ఇద్దరూ పరస్పరం సహకరించుకుంటారని భావించిన వైసిపి టెక్కలి నియోజకవర్గానికి చెందిన వ్యక్తినే బరిలో నిలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఎంపి రామ్మోహన్ నాయుడుపై పోటీ చేసి ఓటమి పాలయిన దువ్వాడ శ్రీనివాసు ఈ సారి టెక్కలిలో అచ్చెన్నాయుడుపై పోటీ చేయనున్నారు. అదేవిధంగా టెక్కలిలో అచ్చెన్నాయుడుతో ఢీకొట్టి అపజయం పొందిన పేరాడ తిలక్ ఈ సారి ఎంపీ రామ్మోహన్ నాయుడుతో తలపడనున్నారు. వైసిపిలో చేసిన ఈ రాజకీయ బదిలీలు పార్టీని ఎంతవరకు గట్టెక్కిస్తాయనేది వేచి చూడాల్సి ఉంది.

చెత్తను ఏరుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

సబ్ కలెక్టర్ శ్రమదానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం ఉదయం స్వచ్ఛ టెక్కలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టెక్కలి కచేరీవీధి పరిసరాల్లో ఉన్న చెత్తను వాలంటీర్లతో ఆయన స్వయంగా ఏరుతూ చెత్త బుట్టలతో సేకరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. రోడ్లపై చెత్తను వెయ్యొద్దని స్థానికులను కోరారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుద్ధ్యపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావుకు ఆదేశించారు. ఎంపిటిసి కూన పార్వతి, వార్డుసభ్యులు రవి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

యువత రోల్ మోడల్‌గా నిలవాలి

నౌపడ: భవిష్యత్ తరాలకు యువత రోల్ మోడల్‌గా నిలవాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం గ్రంథాలయ గ్రౌండ్ వద్ద శనివారం పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకు గ్రామాల్లో క్రీడలపై ఆసక్తి తగ్గిపోతున్న తరుణంలో వీటిని ప్రోత్సహిస్తున్న పిడి నగరపెంట రామన్న దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గంగారాపు రమేష్ కుమార్ జ్ఞాపకార్థంతో పోటీలు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న టోర్నీలో పూండి సచిన్ స్పోర్ట్స్ ప్రథమస్థానం సాధించి రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ, టెక్కలి గ్రౌండ్ టీం రూ.7 వేలు నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు అశోక్ చక్రవర్తి, తహశీల్దార్ జె.చలమయ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, రమేష్ కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎఇఇగా అనిల్‌కుమార్ ఎంపిక

అనిల్‌కుమార్

పొందూరు: ఈనెల 12న ఎపిపిఎస్‌సి విడుదల చేసిన ఫలితాల్లో భూగర్భ జలవనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మండలం తోలాపి గ్రామానికి చెందిన కోటిపాత్రుని అనిల్‌కుమార్ ఎంపికయ్యాడు. అనిల్‌కుమార్ పదోతరగతి కింతలి జెడ్‌పిహెచ్ఎస్‌లో, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో, ఆంధ్రా యూనివర్సిటీలో బిటెక్ పూర్తిచేసాడు. ఈయన తండ్రి శ్రీరామమూర్తి విశ్రాంత ఆర్మీ ఉద్యోగికాగా, తల్లి అరుణకుమారి గృహిణి. అనిల్‌కుమార్ ఎఇఇ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

బిసిల ప్రగతి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- పోలాకి

మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం బిసిల చైతన్యయాత్ర జయహో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడూరు, పీరువాడ, గతలవలస, వనవిష్ణుపురం, కోడూరు, మగతపాడు, గుప్పాడపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, రాజారాంపురం, అంపలాం, పోలాకి గ్రామాల్లో బగ్గు రమణమూర్తికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో వైసిపి ప్రభుత్వం బిసిలపై చేసిన దాడులు ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన అప్పటి ఎన్‌టిఆర్, ఇప్పుడు చంద్రబాబునాయుడు జీవన శైలి బిసిల జీవనశైలి ఒక్కటేనన్నారు. ఒక్క అవకాశం అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, పార్లమెంట్ యాదవ సాధికారిత కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు, జిల్లా నగర సాధికారిత కన్వీనర్ నల్లన వెంకునాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ మైలపల్లి త్రినాథ్, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న చందనం

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి- కవిటి

కవిటి బెహరా వీధిలో పున:నిర్మిస్తున్న శ్రీ జగన్నాథస్వామి ఆలయం, కవిటి నుంచి సముద్ర తీరం చేరుకునే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాలకు దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా మండలం జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన పూడి చందనం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.25వేలు, శ్రీ జగన్నాథ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.5వేలు విరాళంగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన జగన్నాథస్వామి దేవాలయం, నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణాలకు దాతల సాయం చాలా అవసరమని, దాతలు ఉదారంగా స్పందించి విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి చందాన పూర్ణచంద్రరావు, మొగిలిపురి సీతాలు, బచ్చు పాపాయ్య రెడ్డి, తిరుపతి బెహరా పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రాయల్ డాన్స్ క్లబ్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాయల్ డాన్స్ క్లబ్ ఫౌండర్ పి.యోగేంద్ర, స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.దేవీప్రసాద్‌లుపాల్గొని ప్రారంభించారు. ముందుగా రంగురంగుల పతంగులను ఎగురవేశారు. సేంద్రీయ వ్యవసాయ రైతులు ఏర్పాటు చేసిన కూరగాయలు, పప్పు దినుసులు, వరికంకిలు, పువ్వులతో కలిపిన స్వాగత ముగ్గులు వేసి అందరినీ అలరించారు. అలాగే మహిళలు, చిన్నారులు వేసిన రంగుల ముగ్గులను నడుమ నృత్యాలు ప్రదర్శించారు. భోగి మంటలను వెలిగించి, మహిళలతో కలిసి భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డాన్స్ కొరియోగ్రాఫర్స్ జుంబ ట్రైనర్ రాంబాబు, హరీష్, భానుప్రకాష్, రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, జ్యోతి, నాని, బి.వి.ఎస్.సత్యనారాయణ, శివ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడాలో శివానంద గిరిపై కనుమ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కనుమ ఉత్సవాల సందర్భంగా భోగి పండుగ రోజు ఆదివారం సామూహిక రంగవల్లి పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బంగారు లాకెట్, డైనింగ్ సెట్, హాట్ బాక్స్ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. వేలాది మంది ప్రజలు రాకతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పొందూరు : దుస్తులు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌నాయుడు, రవికుమార్

నౌపడ : బాలికలకు అందించిన కానుకలతో చైర్మన్ సివి రాజా

ప్రజాశక్తి- పొందూరు

జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎన్ని సేవా కార్యక్రమాలను చేసినా వారి రుణం తీర్చుకోలేనిదని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలం కింతలి గ్రామంలో దుంపల వెంకట సత్యనారాయణ, లక్ష్మీకాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు దుంపల సన్యాసిరావు విజయలక్ష్మి దంపతులు నిర్వహించిన పేదలకు వస్త్రదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులను 18ఏళ్లుగా స్మరించుకుంటూ వారికి విగ్రహాలను పెట్టి ప్రతీఏటా సంక్రాంతిని పురస్కరించుకుని సన్యాసిరావు మాష్టర్ నిరుపేదలకు వస్త్రదానం చేయడం గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రులు లేకపోతే మనం లేమన్న విషయాన్ని ప్రతిఒక్కరు గమనించాలని, ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సన్యాసిరావు మాష్టర్ ప్రస్తుత సమాజంలో యువతకు ఆదర్శమన్నారు. అనంతరం పరిసర గ్రామాలకు చెందిన వందలమంది నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, విశ్రాంత సిఇఒ సురంగి మోహనరావు, విశ్రాంత ఆర్ఐఒ గవర గోవిందరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, పట్టణ కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, జిల్లా తెలుగుయువత జనరల్ సెక్రటరీ బలగ శంకర భాస్కరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది నిరుపేదలకు ఈ వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టుశాలి సంక్షేమ సంఘం సభ్యులు ఎం.శ్రీరంగనాయకులు, డివిఎస్ ప్రకాశరావు, కోరుకొండ సాయికుమార్, సత్యారావు, బాసా ఆనంద్‌మోహన్, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో పేదలకు శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్ క్లబ్, వరం ఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఏర్పాటు చేసిన దుస్తులను అడిషినల్ క్రైమ్ ఎస్‌పి పి.విఠలేశ్వరరావు పంపిణీ చేశారు. మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రటరీ రామ్ గోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : సంక్రాంతిని పురస్కరించుకొని 'చారిటీ బాక్సు' ఆధ్వర్యాన విశాఖపట్నం, బాపట్ల జిల్లా మార్టూరు, పాయకరావుపేటలోని మాసాహెబ్‌పేట, నరసన్నపేటలో నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేశామని కొప్పుల భాస్కరరావు తెలిపారు. ఒక్కొక్కరికీ 15 రకాల వస్తువులు, 15 కేజీల బరువు గల సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవిత, శంకర్ పంతులు శివ తదితరులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో తల్లిదండ్రు కోల్పోయిన అనాధ బాలికలకు బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వస్తువులను, నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ నౌపడ ప్రాజెక్టు చైర్మన్ సివి రాజా మాస్టర్ మాట్లాడుతూ సంస్థ తరఫున ఎండి చాంద్ పాషా, ఎన్‌ఆర్‌ఐలు సతీష్, అనిత సహకారంతో గత నాలుగేళ్లుగా సహాయం చేస్తున్నామన్నారు. వీరికి నాలుగు జతల బట్టలు, నైట్ డ్రెస్సులు, కాస్మోటిక్స్, స్టేషనరీ, రూ.2 వేలు నగదు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.జయ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పలాస: పలాస కాశిబుగ్గలో 23 మంది తెలగ పేద కుటుంబాలకు బియ్యం, రేషన్, దుస్తులు, నగదు అందజేయడం జరిగిందని రాజరాజేశ్వరి దేవి తెలగ సంఘం అధ్యక్షుడు శీలం రూప సుందర్, కార్యదర్శి వాసు, కోశాధికారి అప్పారావులు తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు పేద కుటుంబాలకు సరుకులు అందిస్తున్నామని, ఈ ఏడాది కూడా 23 మంది పేద కుటుంబాలకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ వైస్ ప్రెసిడెంట్ బల్ల శ్రీనివాసరావు, పలాస కాశీబుగ్గ తెలగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: వల్లేవలసకు చెందిన మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున గోవిందపురం, వడ్డివాడ, నర్సాపురం పంచాయతీల్లో నిరుపేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను శనివారం పంపిణీ చేశారు. సంక్రాంతిని బీద కుటుంబాలు ఆనందంగా జరుపుకోవాలని ఈ సరుకులు పంపిణీ చేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, రామినాయుడు మాస్టర్, ఇప్పిలి అప్పన్న పాల్గొన్నారు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు టెక్కలికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త టంకాల సత్యనారాయణమూర్తి(బాబ్జి) సుగుణ దంపతులు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పారిశుద్ధ కార్మికులు, మంచినీటి సరఫరా కార్మికులకు, శానిటేషన్ కార్మికులు 84 మందికి మహిళలకు చీరలు, పురుషులకు డ్రెస్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈయనతో పాటు వెంకటరమణ మూర్తి ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దుస్తులు పంపిణీ చేస్తున్న విఠలేశ్వరరావు

టెక్కలి రూరల్ : దుస్తులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ దంపతులు

సంతబొమ్మాళి : సరుకులను అందజేస్తున్న మనబడి అసోసియేషన్ సభ్యులు

పండగ వేళ అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

సంక్రాంతి పండుగకు ఊరెళ్లేవారికి పోలీసులు పలు సూచనలు చేశారు. తాళం వేసిన ఇళ్లే దొంగలు లక్ష్యంగా చేసుకుంటారని, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని జెఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్ సూచించారు. ఊరెళ్లే వారు బంగారు, వెండి ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళాన్ని అమర్చుకోవాలని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా ఈ సూచనలు పాటించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న బెంతు ఒరియాలు

బెంతు ఒరియాల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి- కవిటి

తమజాతి గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు శనివారం అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. బస్టాండ్‌లో చేస్తున్న ఈ రిలే నిరాహారదీక్షల్లో 17వ రోజు రత్తకన్న గ్రామస్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్ శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లభించే వరకు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రజనీ కుమార్ దొలై, సుమన్ బిసాయి, కృష్ణ బిసాయి, బృందావన్ బిసాయి, మోహన్ మజ్జి, గోపి బిసాయి, శంకర్ పాల్గొన్నారు.

ధ్వంసమైన ఫ్లెక్సీని చూపిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఫ్లెక్సీల ధ్వంసం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చిన్నబడంలో వైసిపి అల్లరి ముఖాలు టిడిపి ఫ్లెక్సీలను ధ్వంసం వేశారు. వైసిపికి చెందిన కొంతమంది నాయకులు, కార్యకర్తలు, చిల్లర చేష్టలు చేస్తూ అందులో భాగంగా రాబోయే ప్రభుత్వంలో ఇచ్చే పథకాలను తెలియజేస్తూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ఫ్లెక్సీ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు చించివేసి ఆనందం పొందారు. టిడిపి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, టిడిపి నాయకులు ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలతో టిడిపి విజయాన్ని అడ్డుకోలేరని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ఆసరా లబ్ధిదారులతో సమీక్ష

ఇచ్ఛాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం ఎం.ప్రసాదరావు వైఎస్ఆర్ ఆసరా పథకంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ లబ్ధిదారుల విజయాలు అప్‌లోడ్ చెయ్యాలని సిబ్బందికి సూచించారు. అలాగే జలజీవన్ మిషన్‌కు సంబంధించి గ్రామ జల సంఘాలతో బ్యాంక్ ఖాతాలు ప్రారంభించాలని, సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సిసిలు మోహనరావు, లక్ష్మీ, అకౌంటెంట్ మోహిని, విష్ణు బాబు, విఒఎలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుంటాం

వజ్రపుకొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానాన్ని వైసిపి కైవసం చేసుకుంటుందని పరువు ఉద్దాన ప్రాంత సర్పంచ్‌లు అన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా పేరాడ తిలక్‌ను అధిష్టానం ప్రకటించడంతో శనివారం ఆయనను కనితివూరులో సర్పంచ్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఉద్దాన ప్రాంత ప్రజలు తిలక్ వెంట నడిచి ఆయన గెలుపునకు సహకరిస్తారమన్నారు. కార్యక్రమంలో అమలపాడు సర్పంచ్‌లు దున్న రత్నం బాలరాజు, కర్ని శ్రీను, చింత రాజు, చింత హీమారావు, వైసిపి నాయకులు గిరి, ఢిల్లీరావు, జోగారావు పాల్గొన్నారు.

పొందూరు: 1996-97లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు

అలనాటి జ్ఞాపకాలు

ప్రజాశక్తి- కవిటి

వారంతా సుమారు 24 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆడారు. పాడారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులు పిరియా కృష్ణారావు, పూడి నీలాచలం, పండి బలరామమూర్తి, బి.లక్ష్మణరావు, పండి ఢిల్లేశ్వరరావు, బి.జానకిరావు, మహి మున్నీసా బేగం, దేవేంద్ర నాథ్ పండా, బప్పా మాస్టర్ తదితరులను సన్మానించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను తలచుకుని ఆనంద సాగరంలో తేలియాడారు. 1995-2000 పదో తరగతి విద్యార్థులు శనివారం జరుపుకున్న ఈ అపురూప కార్యక్రమానికి రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది.

పొందూరు: మండలం కింతలి పైడి లక్ష్మీనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గడిపిన చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విశ్రాంత డిఎస్‌పి

ప్రజాశక్తి- కవిటి

తన విశ్రాంత జీవితాన్ని ఆధ్యాత్మిక, సామాజిక సేవకు అంకితం చేస్తున్న విశ్రాంత డిఎస్‌పి ఎస్‌వివి ప్రసాదరావు ఆదర్శనీయుడని బొరివంక సర్పంచ్ బెందాలం శ్రీరామ్ ప్రసాద్ కొనియాడారు. శ్రీ వివేకానంద-ఐన్ స్టీన్ ట్యూషన్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాదరావు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు ఉచితంగా చదువు నేర్పుతున్న కాళీ సాహును అభినందించారు. ట్యూషన్ సెంటర్ పూర్తిస్థాయి నిర్వహణ కోసం తనవంతుగా రూ.10వేలు అందించి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విశ్రాంత డిఎస్‌పి ప్రసాదరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి డి.సతీష్, మాజీ ఎంపిటిసి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణమూర్తి, విజయ్ ప్రసాద్, గ్రామస్తులు దలై భగీరథి, ఆముదాల భాస్కర్, జగన్నాథ్ పురియా, హరికృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలం సన్యాసి పుట్టుకలో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. కేసుపురం పంచాయతీ యువకులు 6, 7, 8 తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా వివేకానందుని చిత్రపటానికి నివాళ్లర్పించారు. క్విజ్ పోటీల్లో ముత్యాలపేట జెడ్‌పి హైస్కూల్, కవిటి స్కూల్, కెజిబివి జాడపూడి కాలనీ పాఠశాలల విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంఇఒ కె.అప్పారావు, గ్రామపెద్ద మాసుపత్రి వీరాస్వామి, విశ్రాంతి ఉపాధ్యాయులు కరగాన ఏకాంబరరావు, మోహనరావు, జయపతి, మాస్టర్లకు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు సన్మానం చేశారు. కార్యక్రమంలో నర్తు గంగయ్య మాస్టర్, బోర చిన్నారావు, మాసుపత్రి చంద్రశేఖరం, కర్రి సోమేష్, సవాడ గణేష్, నందూరు శ్రీను, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

విశ్రాంత డిఎస్‌పిని సన్మానిస్తున్న ట్యూషన్ నిర్వాహకులు

పొత్తుతో ఇచ్ఛాపురం టిడిపి పదిలమేనా!

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తులో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైపు జనసేన ఆశలు పెట్టుకుంది. టిడిపికి ఆది నుంచి కంచుకోటగా వస్తుంది. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అనుకూల పవనాలు వీచినా ఇచ్ఛాపురంలో టిడిపి విజయం సాధించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ వరుసుగా రెండుసార్లు గెలిచి ఈసారి ఎన్నికల్లో కూడా విజయం సాధించి హెట్రిక్ సాధించాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. జనసేనతో టిడిపి పొత్తు వలన టిడిపికి కంచుకోటగా ఉన్న ఇచ్ఛాపురంపై జనసేన నేతలు దృష్టి సారించారు. నియోజికవర్గంలో జనసేనకి కనీసం 30 నుంచి 40శాతం ఓట్లు ఉండాలి, ఇచ్ఛాపురంలో మాత్రం గత ఎన్నికలో పది వేలు ఓట్లు వరకు వచ్చాయి. ప్రస్తుత పరిస్థితిలో అనుకున్న శాతం ఓట్లులేని పరిస్థితుల్లో జనసేనకి ఎలా ఇస్తారని టిడిపి క్యాడర్ వాదిస్తుంది. రానున్న ఎన్నికల్లో ఈసారి వైసిపి జెండా ఎగుర వెయ్యాలని గట్టి పట్టుదలతో వైసిపి పథకాలు రచిస్తున్నారు. ఇరు పక్షాల మధ్య హోరాహోరీగా జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైసిపి గెలుపే ధ్యేయంగా సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నారు. ఏమాత్రం చిన్న అవకాశాలు ప్రత్యర్థులకి ఇవ్వకకుండా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బెందాలం అశోక్ ధీటైన అభ్యర్థిగా పోటీలో ఉండాల్సిన అవసరం ఉందని పార్టీవర్గాలు అంటున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారం నుండి గద్దెదించాలని పట్టుదలతో ఓట్లు చీలకుండ చూడాలని టిడిపితో పొత్తు పెట్టుకున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అనిచ్చిత పరిస్థితుల్లో టిడిపి అభ్యర్థి అశోక్‌కే ఇవ్వాలని టిడిపి అధిష్టానం భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. జనసేనలో కూడా టిక్కెట్ ఆసిస్తున్న వారిలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మారోనేత లోల్ల రాజేష్‌తో పాటు తిప్పన దుర్యోధన రెడ్డి ఆశీస్తున్నారు. ఇరు పార్టీలు సమన్వయ సమావేశాలు నిర్వహించి ఎవ్వరికీ టిక్కెట్ దక్కినా కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా అధికార వైసిపి ఇప్పటికే జెడ్‌పి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పిరియా విజయకు సమన్వయకర్తగా నియమిస్తూ రానున్న ఎన్నికల్లో వైసిపి నుండి ఎన్నికల భరిలో నిలబెట్టారు. మిగిలింది జనసేన, టిడిపి పొత్తు అభ్యర్థి ఖారారు కావాల్సి ఉంది. మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్ భార్య, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయను ఢీకొట్టే అభ్యర్థి అశోక్ అయితే సమ ఉజ్జిగా ఉంటుందని భావిస్తున్నారు.

హెచ్‌ఆర్‌ఎం జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- పలాస

హ్యూమన్ రైట్స్ మిషన్(హెచ్‌ఆర్‌ఎం) జిల్లా శాఖ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లా శాఖకు పలాస నియోజకవర్గానికి చెందిన ఈశ్వర్ పాత్రో (జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ)గా, మల్లేన దేవరాజు (జిల్లా వెల్ఫేర్ సెక్రెటరీ)గా నియమించారు. వీరికి హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, కాశీబుగ్గ డిఎస్‌పి జి.నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. 2024-2025 రెండేళ్ల పాటు పదవీకాలం కొనసాగుతుందని కుమార్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు సైక్ భాషా, జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.జి. కుమార్, ప్రముఖ జానపద గాయకులు నక్క వాసు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న కుమార్‌నాయక్, నాగేశ్వరరెడ్డి

సిబిసిఎన్‌సి కార్యవర్గం ఎన్నిక

ఆమదాలవలస: పట్టణంలో ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో శనివారం సిబిసిఎన్‌సి నూతన అధ్యక్షునిగా పి.జార్జి ఎచినేజర్, ప్రధాన కార్యదర్శిగా పి.కృపారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు ఉన్న 52 బాప్టిస్ట్ చర్చ్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలను నామినేటింగ్ కమిటీ కన్వీనర్ ప్రవీణ్ కుమార్ రాజు, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే రెస్ట్ చైర్మన్‌గా హెచ్ఎస్ఎస్ పాల్, ఉపాధ్యక్షులుగా ఆర్. సావిత్రి, రికార్డింగ్ కార్యదర్శిగా సిహెచ్‌జె. ప్రవీణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గాజాకు సంఘీభావం

సంత బొమ్మాళి: గత మూడు నెలలుగా పాలస్తీనాలో గాజాపై ఇజ్రాయల్ చేస్తున్న దారుణ మారణకాండని నిరసిస్తూ జనసాహితి ఆధ్వర్యంలో గాజాకు సంఘీభావం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక క్రీడా మైదానంలో నిర్వహించిన సమావేశంలో జనసాహితి సంతబొమ్మాళి మండల సభ్యులు నరేష్ మాట్లాడుతూ హమాస్ పేరుతో గాజాలో ప్రజలపై, ఆస్పత్రులపై, శరణార్థ శిబిరాలపై ఇజ్రాయల్ చేస్తున్న మారణకాండను విరమించాలని కోరారు. గత మూడు నెలల్లో 30వేలకుపైగా బాంబులతో రోజుకు సగటున 300 మంది చొప్పున హత్య చేయబడుతు న్నారన్నారు. కార్యక్రమంలో జనసాహితి సభ్యులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు, యువత పాల్గొని సంఘీభావం తెలిపారు.

మాట్లాడుతున్న నరేష్

కాశీబుగ్గ సిఐ బాధ్యతల స్వీకరణ

పలాస : కాశీబుగ్గ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎన్.విజయానంద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాద పూర్వకంగా డిఎస్‌పి నాగేశ్వరరెడ్డిని కలిశారు. ఇక్కడ పనిచేసిన సిఐ నవీన్ కుమార్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ చేయగా, విజయనగరం టూటౌన్ సిఐగా పనిచేస్తున్న విజయానంద్‌ను కాశీబుగ్గలో నియమించారు. బాధ్యతలు చేపట్టిన విజయానంద్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రామారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

రామారావు మృతి పార్టీకి తీరనిలోటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో చీమలవలస గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు సనపల రామారావు మృతి టిడిపికి తీరనిలోటని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామారావు కుటుంబాన్ని రవికుమార్ శనివారం పరామర్శించారు. అలాగే మండలంలో పలు గ్రామాల్లో రవికుమార్ పర్యటించి వివిధ కారణాలతో ఇటీవల మరణించిన టిడిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భూ హక్కు చట్టంపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రజలందరికీ అయోమయానికి గురి చేస్తున్న భూ టైటిలింగ్ యాక్టును ఎందుకు తెచ్చారో చెప్పాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం అరసవల్లిలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ చట్టం గురించి పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వాస్తవాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. న్నారు. ప్రజలు, న్యాయవాదులు సైతం ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తుంటే కప్పదాటు వైఖరిలో ధర్మాన మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లుగా అస్తవ్యస్తమైన పాలన అందిస్తున్న వైసిపి ప్రభుత్వం తీరుపై మంత్రి మాట్లాడాలని అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పున:నిర్మాణంతో పాటు ఆమదాలవలస -శ్రీకాకుళం రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

అరసవల్లికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నగరంలోని పిఎన్ కాలనీకి చెందిన జవ్వాది రమాజయశ్రీ, ఆమె కుమార్తెలు శ్రీజ, శ్రీహరిలు రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయాన్ని సందర్శించిన తన తల్లి తోటకూర మీనాక్షి జ్ఞాపకార్థం ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌కు చెక్కును అందజేశారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న యోగి

రోడ్డు పనులు పరిశీలన

మెళియాపుట్టి: మండలంలో గొప్పిలి గ్రామంలో రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.20 లక్షల వ్యయంతో కాలనీ సమీపంలో సిసి రోడ్డు అభివృద్ధి పనులు గత నాలుగు రోజులుగా సాగుతున్నాయి. ఈ పనులను స్థానిక సర్పంచ్ మాలతి జయసుధ ప్రతినిధి యోగి శనివారం పరిశీలించారు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఎచ్చెర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని ఎంపిపి మొదలవలస చిరంజీవి అన్నారు. శనివారం ముద్దాడ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన కల్వర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రాకపోకలు సాగించేందుకు నూతన రహదారులు, కల్వర్టులను నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ శంకర్, వైస్ ఎంపిపి బెండు రామారావు, లింగాల లక్ష్మణ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ప్రారంభిస్తున్న ఎంపిపి చిరంజీవి